రాజలింగమూర్తి హత్యకు సహకరించింది ఎవరు ?

- పోలీసుల అదుపులోనే నిందితులు
- గణపురం పోలీస్ స్టేషన్‌లో సాగుతున్న విచారణ
- కాల్ డేటా ఆధారంగా అదుపులోకి మరి కొందరు

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లిలో మాజీ కౌన్సిలర్ నాగవెళ్లి సరళ భర్త రాజలింగమూర్తి హత్యకు సంబంధించిన నిందితులు పోలీసుల అదుపులోనే ఉన్నా హత్యకు సహకరించింది ఎవరనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. వారిని భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో కాకుండా గణపురం స్టేషన్‌లో ఉంచి విచారణ జరుపుతున్నారు. నిందితుల నుంచి ఆటో, ద్విచక్ర వాహనాలు, హత్యకు ఉపయోగించిన కత్తులు, గొడ్డళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఎవరు సహకరించారు? మీరే హత్య చేశారా? ఎవరితోనైనా చేయించారా? అనే కోణంలో విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇతర వ్యక్తులతో హత్య చేయించి కేసు మీపై వేసుకుంటున్నారా? డబ్బులు ఎవరు సమకూర్చారంటూ పలువురిని అదుపులోకి తీసుకుని వారి బ్యాంకు ఖాతా వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. తమ భూమిని స్వాధీనం చేసుకోవడానికి రేణుకుంట్ల కుటుంబ సభ్యులే తన భర్తను హత్య చేశారని మృతుడి భార్య సరళ ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసింది. కాగా, అదే రోజు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కొందరిని భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో, మరి కొందరిని గణపురం పోలీస్ స్టేషన్‌లో ఉంచి విచారణ కొనసాగిస్తున్నారు. రెండు రోజులు దాటినా కేసు ఇంకా కొలిక్కి రాలేదు. కేసులో ఎలాగైనా బీఆర్ఎస్ నేతలను ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతున్నది.

అడవి పందులతో దెబ్బ తిన్న మక్కజొన్న

ములుగురూరల్, ఫిబ్రవరి 22 : అడవి పందుల కారణంగా ఆరు ఎకరాల మక్కజొన్న చేను దెబ్బతిన్నది. ఈ ఘటన ములుగు మండలం పొట్లాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. బాధిత రైతు పాలడుగుల సమ్మయ్య కథనం ప్రకారం.. తన ఆరు ఎకరాల భూమిని బిడ్డ పేరుపై రాసిఇచ్చానన్నారు. ఆ పొలంలో నిరుడు వరి పంట వేయగా చేతికి వచ్చే సమయంలో అడవి పందులు ధ్వంసం చేయగా రూ.4 లక్షల నష్టం వచ్చిందని వాపోయాడు. ప్రస్తుతం అప్పులు తెచ్చి ఆరు ఎకరాల్లో మక్కజొన్న పంట వేయగా దానిని సైతం నాశనం చేశాయని ఆవేదన వ్యక్తం చేశాడు. పంట చేను చుట్టూ కరెంట్ పెట్టినా, ఉచ్చులు పెట్టినా కేసులు నమోదు చేస్తామని అధికారుల హెచ్చరికలు ఉన్నందున ఐదు రోజుల క్రితం ఫారెస్టు అధికారులను కలిసి తన చేనును పందులు పాడు చేస్తున్నాయని, వాటి నుంచి పంటను రక్షించాలని వేడుకున్నానని తెలిపాడు. అయినప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. ప్రస్తుతం పంట మొత్తం ఆగమైందని, రూ.15లక్షల అప్పు ఎలా తీర్చాలని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని బాధిత రైతు సమ్మయ్య వేడుకున్నాడు.

ధ్వంసమైన మక్కజొన్న పంట

నస్తూర్‌పల్లి అడవుల్లో పెద్దపులి కదలికలు

- పాదముద్రల ఆనవాళ్ల గుర్తింపు
- అడవులను జల్లెడ పడుతున్న అధికారులు

కాటారం, ఫిబ్రవరి 22 : మహదేవపూర్ అడవుల్లో నుంచి పెద్దపులి కాటారం రేంజ్ పరిధిలోకి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించగా పులి జాడ కోసం శనివారం అటవీ అధికారులు, సిబ్బంది అడవుల్లో పలు చోట్ల పరిశీలించారు. వీరాపూర్ అడవుల్లోని కుంటలో పులి నీళ్లు తాగి బండ్ల బాట గుండా నస్తూరుపల్లి అడవుల్లోకి వెళ్లినట్లు పలు చోట్ల పాదముద్రలను అధికారులు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అడవుల్లోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా, ఈ నెల 9న రాత్రి పులి నస్తూర్‌పల్లి అడవుల్లో కనిపించగా అప్పటి నుంచి కాటారం, మహదేవపూర్ రేంజ్‌ల పరిధి అడవుల గుండా సంచరిస్తున్నది. దీంతో డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి నేతృత్వంలో అధికారులు జన్నారం, కవ్వాల్ అభయారణ్యం టైగర్ ట్రాకర్లలో 12 రోజులుగా పెద్ద పులి కోసం వెతుకుతున్నారు. పలు చోట్ల ట్రాప్ కెమెరాలు అమర్చారు. 8-10 బృందాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. అటవీ అధికారులు చంద్రశేఖర్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది ఉన్నారు.

వీరాపూర్ అడవుల్లో పులి పాదముద్ర

పలుగుల అడవిలో ఎద్దు మృతదేహం కలకలం

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 22 : మండలంలోని పలుగుల గ్రామ గారకుంట పోచమ్మ దేవర సమీప అటవీ క్షేత్రంలో ఓ ఎద్దు మృతదేహం కలకలం రేపింది. ఇటీవల గ్రామంలో పులి సంచరించిన విషయం తెలిసిందే. మృతి చెందిన ఎద్దుపై తీవ్ర గాయాలు ఉండడంతో పులి దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. గ్రామానికి చెందిన రైతు నిట్టూరి శంకరయ్యకు చెందిన ఎద్దు నాలుగు రోజుల క్రితం మేత కోసం సమీప అడవిలోకి వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ శివారు అడవుల్లో పులి సంచరిస్తుందనే సమాచారంతో దానిని వెతికేందుకు ప్రయత్నించలేదు. కాగా, పులి గ్రామాన్ని వదిలి మరో చోటుకు వెళ్లిందనే విషయం తెలిసి మరికొందరు రైతులతో కలిసి శంకరయ్య అడవిలో వెతకగా, గారకుంట పోచమ్మ దేవర సమీప అడవిలో గాయాలతో కుళ్లిన స్థితిలో ఉన్న ఎద్దును గుర్తించారు. విషయాన్ని అటవీ శాఖ అధికారులను తెలిపినా వారు స్పందించలేదని బాధిత రైతు వాపోయాడు. కనీసం ఘటనా స్థలాన్ని పరిశీలించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎద్దు విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందని, తనను ఆదుకోవాలని బాధిత రైతు శంకరయ్య కోరుతున్నాడు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రతిపక్షాలపై బురద చల్లడం సిగ్గుచేటు

గణపురం, ఫిబ్రవరి 22 : రాజలింగం హత్యపై అధికార కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షాలపై బురద చల్లడం సిగ్గుచేటని, ప్రభుత్వం వెంటనే విచారణ వేగవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కర్ణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొలుసాని లక్ష్మీ నర్సింహారావు, సొసైటీ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. హత్యతో సంబంధం లేని వ్యక్తులకు అపాదించేలా కాంగ్రెస్ నాయకులు కుట్ర పండుతున్నారని విమర్శించారు. హత్యకు భూ వివాదాలు కారణమని స్థానిక ప్రజలు, పోలీసులు చెప్తున్నప్పటికీ, కావాలని కాంగ్రెస్ నేతలు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సరికాదన్నారు. సమావేశంలో చెల్పూర్ మాజీ సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్ రావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పేరాల దేవేందర్‌రావు, కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కట్ల ప్రశాంతీ శంకరయ్య, నాయకులు జన్నయ్య, బొట్ల స్వామి, మార్త సుధాకర్, గాజర్ల రాజు (చింటు), సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గంధం సుధాకర్, ఆకుల రాజ్‌కుమార్, ఓదెలు సాయి, చక్రి, అభిరామ్ పాల్గొన్నారు.

నెర్రబారుతున్న పంట పొలాలు

నెర్రెబారుతున్న వరి పంట

గోవిందరావుపేట, ఫిబ్రవరి 22 : మండలంలోని నర్సింహుల కాలువ శివారులోని గౌరారం రైతుల పంటలకు సాగు నీరు అందక నెర్రబారుతున్నాయి. యాసంగిలో నర్సింహులు-1,2 కాలువలకు ఐబీ అధికారులు తైబంది ప్రకటించారు. సాగుకు ముందు అధికారులు షెట్టర్లు బిగించకపోవడంతో ఆ పనుల కోసం 10 రోజుల వరకు నీటి సరఫరాను నిలిపివేశారు. అనంతరం కాలువలోకి నీరు వదిలినప్పటికీ సుమారు 200 ఎకరాల ఆయకట్టుకు నీరు అందడం లేదు. షెట్టర్లు వదలడంతో ఉట్ల పంపు కాల్వకు ఎక్కువ శాతం నీరు వెళ్తుందని, తమ చివరి పొలాలకు నీరు అందడం లేదని, అధికారులు స్పందించి నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

వేధింపులకు గురి చేస్తే సమాచారం ఇవ్వాలి

ములుగురూరల్, ఫిబ్రవరి 22 : మహిళలు, బాలికలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే వెంట నే జిల్లా షీటీమ్‌లకు సమాచారం ఇవ్వాలని షీటీమ్ ఎస్సై మౌనిక అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఎస్పీ శబరీశ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ ఆదేశాల మేరకు షీటీమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యా సంస్థల వద్ద, రద్దీ ప్రదేశాల్లో టీమ్స్‌లతో నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా వేధించినా, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే షీటీమ్ నంబర్ 8712670115 లేదా డయల్ 100కి ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి న్యాయం జరిగేలా చూస్తామని వివరించారు. అనంతరం మానవ అక్రమ రవాణా, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న షీటీమ్ ఎస్సై మౌనిక

మొరుమురు గ్రామ శివారులో మంటలు

వాజేడు, ఫిబ్రవరి 22 : మండలంలోని మొరుమురు గ్రామశివారులో పంట చేన్లకు దగ్గరగా శనివారం మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న కార్యదర్శి గడ్డం కార్తీక్, సిబ్బంది పాయం శాంతమూర్తి, సూర్యనారాయణ, సమ్మయ్య, బాబుతో పాటు గ్రామ యువకులు గ్రామపంచాయతీ వాటార్ ట్యాంకర్ నీటితో మంటలను ఆర్పివేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించి మంటలను అదుపుచేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, రెవిన్యూ సిబ్బంది సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మంటలను ఆర్పివేస్తున్న జీపీ సిబ్బంది, గ్రామ యువకులు

ఘనంగా వరల్డ్ థింకింగ్ డే వేడుకలు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 22 : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సింగరేణి డిస్ట్రిక్ట్-భూపాలపల్లి ఆధ్వర్యంలో సుభాష్‌కాలనీలోని స్కౌట్ డెన్‌లో 'వరల్డ్ థింకింగ్ డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి హాజరై స్కౌట్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం సేవే పరమార్ధంగా రూపొందిన వ్యవస్థ అని తెలిపారు. 1907లో బ్రిటన్ లో 20 మందితో ఈ వ్యవస్థ ప్రారంభమైందని, ప్రస్తుతం ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల్లో సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేసిన వివిధ గ్యాడ్జెట్స్‌ను పరిశీలించి వారిని అభినందించారు. అనంతరం ప్రపంచ శాంతి- ప్రగతి యాత్ర ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి, ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, పీవో శ్రావణ్‌కుమార్, స్కౌట్ లీడర్లు సంజీవరావు, శ్రీనివాస్‌రావు, రాజమొగిలి, రమేశ్, స్వామి పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు పరామర్శ

గోవిందరావుపేట/ తాడ్వాయి, ఫిబ్రవరి 22 : ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను శనివారం బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించారు. గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన మేడ జెగ్గారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆమె బాధిత కుటుంబాన్ని పరామర్శించి, చిన్న వయస్సులో జెగ్గారావు మృతి చెందడం బాధాకరమన్నారు. అనంతరం మృతుడి తల్లికి రూ.5 వేలు అందజేశారు. అలాగే తాడ్వాయి మండలం కొడిశాల గ్రామానికి చెందిన పిడబోయిన లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కుమారులు సతీశ్, వెంకన్నకు 50 కిలోల బియ్యం అందజేశారు. ఆమె వెంట పార్టీ గోవిందరావుపేట మండల అధ్యక్షుడు నర్సింహనాయక్, చందూలాల్, ఎలేందర్, కొమురయ్య, రాంచందర్, సంతోశ్‌కుమార్, నరేశ్, కుమార్, మొగిలి, వెంకన్న, శ్యామ్, రమేశ్, తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మల రాజేందర్, మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహారావు, సుగుణ, కాంతారావు, విజయ, రమేశ్, సమ్మక్క, వెంకన్న, లక్ష్మీనారాయణ ఉన్నారు.

గోవిందరావుపేట : జెగ్గారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాగజ్యోతి

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ములుగు డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ఏటూరునాగారం/ కన్నాయిగూడెం, ఫిబ్రవరి 22 : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. శనివారం ఆయన ఏటూరునాగారం మండలం రొయ్యూరు పీహెచ్‌సీ, కన్నాయిగూడెం మండలకేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల కోసం రోజు వారీగా వస్తున్న వారి వివరాలు తెలుసుకుని అందిస్తున్న సేవలను పరిశీలించారు. మందుల గదిలో ఉన్న నిల్వలను పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్ గదిని సందర్శించారు. విధి నిర్వహణలో సమయ పాలన పాటించాలని లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న మందులు, అత్యవసర మందులపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి చంద్రకాంత్, వైద్యులు అభినవ్, సుచిత్ర, హెల్త్ ఎడ్యుకేటర్ సుజాత, స్టాఫ్ నర్సు అజ్మీర, ఫార్మాసిస్ట్ మనిషా, ల్యాబ్ టెక్నీషియన్ సురేశ్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, స్టాఫ్ నర్సులు, సిబ్బంది ఉన్నారు.

ఏటూరునాగారం : రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 22 : కాళేశ్వరముక్తీశ్వర ఆలయంలో ఈ నెల 25 నుండి 27 వరకు మహాశివరాత్రి జాతర వేడుకలను నిర్వహించనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారులు పనులు చేపడుతున్నారు. శనివారం ఆలయంలో చేపట్టిన కల్యాణ మండల పనులతో పాటు క్యూ లైన్‌లు, లడ్డు ప్రసాదాల తయారీ, సౌకర్యాలు, వసతులను సీఐ రామచంద్రరావు పరిశీలించారు. వేడుకలకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.జారతలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలిస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ తెలిపారు.కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ బుర్రి శ్రీనివాస్, ఎస్సై తమాషా రెడ్డి , జీపీ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ రామచంద్రరావు

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 22 : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలకేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చింతం శ్రీకాంత్ (24) మూడు రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం పురుగుల మందు తాగగా గమనించిన అతని స్నేహితుడు రవి కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలిపి ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా మార్గమధ్యంలో శ్రీకాంత్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కొప్పుల తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దేవాదుల ఎత్తిపోతల మరో మోటర్ ఆన్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 22 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని నాలుగు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ కొనసాగుండగా శనివారం మరో మోటర్ ఆన్ చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఫేస్-2లో ఒకటి, ఫేస్-3లో నాలుగు మోటర్లను ఆన్ చేశారు. ఐదు మోటర్ల ద్వారా రోజుకు 1,414 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నట్లు డీఈఈ శరత్, ఏఈఈ సాయిరాం చెప్పారు. దేవాదుల వద్ద గోదావరి నీటి మట్టం 79.40 మీటర్ల ఎత్తుకు చేరుకుంది.

పోలీసుల అదుపులో గొత్తికోయలు ?

ఏటూరునాగారం, ఫిబ్రవరి 22 : ఛత్తీస్‌గఢ్ నుంచి మిర్చి కోతకు వచ్చిన గొత్తికోయలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మిర్చి కోతల సమయంలో రైతులు కూలీలను ఇక్కడకు తీసుకొస్తుంటారు. ఇందులో భాగంగానే రామన్నగూడెనికి చెందిన ఇద్దరు రైతులు తీసుకవచ్చిన గొత్తికోయల్లో కొందరిని శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

టీజీసెట్-2025కు ఏర్పాట్లు పూర్తి

కాటారం, ఫిబ్రవరి 22 : మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల గురుకుల కళాశాలల్లో గురుకుల ప్రవేశపరీక్ష (టీజీసెట్-2025)కు ఏర్పాట్లు పూర్తయినట్లు శనివారం ప్రిన్సిపాల్స్ రాజేందర్, నాగలక్ష్మి వెల్లడించారు. బాలుర గురుకులం సెంటర్‌లో 480, బాలికల గురుకులం పరీక్షా కేంద్రంలో 360 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని డీసీవో రాజేందర్ తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరానికి గానూ 5వ తరగతిలో ప్రవేశం కోసం, 6-9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి టీజీసెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, పెన్ను తెచ్చుకోవాలని తెలిపారు.

పోడు రైతులపై దాడులను ఖండిస్తున్నాం..

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 22 : భూపాలపల్లి మండలం ఆజంనగర్‌లో పోడు రైతులపై ఫారెస్ట్ అధికారులు దాడులు చేయడాన్ని సీపీఐ పార్టీ తరుపున ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మట్లాడారు. రైతులు, మహిళలని కూడా చూడకుండా ఫారెస్టు అధికారులు దాడి చేయడం బాధాకరమన్నారు. అంతేకాకుండా వారిపై అక్రమంగా కేసులు పెట్టడం హైయమైన చర్య అన్నారు. మహిళా రైతులపై దాడి చేయించిన భూపాలపల్లి డీఎఫ్‌వోపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు మాతంగి రామచందర్, నేరెళ్ల జోసెఫ్, పీక రవికాంత్, పొన్నగంటి రాజేశ్, చంద్రయ్య, తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 22 : సీఎస్సీ హెల్త్ కేర్ వెల్‌నెస్ సర్వీసెస్ సంస్థలో ల్యాబ్ టెక్నీషియన్స్ (ఫ్లెబోటమిస్ట్) ఉద్యోగాలకు జిల్లాలోని అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీఎస్సీ హెల్త్ కేర్ హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల డివిజనల్ మేనేజర్ రవితేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో రిజిస్టర్ అయిన కార్మికులకు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి ఎమ్ఎల్ టీ, డీఎంఎల్ టీ, జీఎన్ఎం, ఏఎన్ఎం, డిగ్రీ కోర్స్ చదివినవారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి నేడు (ఆదివారం) హనుమకొండ జిల్లాలోని కాజీపేట పీఎఫ్ ఆఫీస్ రోడ్‌లో రివవైల్ చర్చ్ పక్కన గల సీఎస్సీ హెల్త్ కేర్ బిల్డింగ్‌లో ముఖాముఖి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, బ్యాంక్ పాస్‌బుక్, పాన్ కార్డు, మూడు పాస్ ఫొటోలు తీసుకొని రావాలన్నారు. వివరాలకు డివిజనల్ మేనేజర్, హెచ్ఆర్ 99491 68494, 99492 21105 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

మంగపేట, ఫిబ్రవరి 22 : మండలకేంద్రంలోని ఉమాచంద్రశేఖరస్వామి ఆలయ శిఖర పునర్ నిర్మాణం కోసం కమలాపురానికి చెందిన ప్రవాస భారతీయుడు కోరుకొప్పుల శంకర్ సమకూర్చిన రూ.లక్ష విరాళాన్ని శనివారం ఆయన మామ పులి నర్సయ్య ఆలయ కమిటీకి అందించారు. అర్చకుడు నరేశ్ శర్మ, ఆలయ కమిటీ బృందం పాల్గొన్నారు.

అడవికి నిప్పు మనుగడకు ముప్పు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 22 : అడవికి నిప్పు మనుగడకు ఎంతో ముప్పు అని ఎఫ్ఆర్వో మాధవీశీతల్ అన్నారు. మండలంలోని బుస్సాపురం-లక్ష్మవరం అటవీ సమీపంలో మంటలు వ్యాపిస్తున్నాయనే సమాచారం మేరకు మధ్యాహ్నం సిబ్బందితో కలిసి వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంతానికి వెళ్లే పశువుల కాపర్లు, కూలీలు నిప్పు అంటించవద్దన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, బీట్ అధికారులు దీప్‌లాల్, అర్జున్‌రెడ్డి, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా భవన నిర్మాణాలు ఉండాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 22 : విద్యుత్ తీగలకు దూరంగా ఉండేలా భవన నిర్మాణాలు చేసుకోవాలని ఏటూరునాగారం సబ్ డివిజన్ ఏడీఈ సుధాకర్ ఒక ప్రకటనలో కోరారు. కొత్తగా బిల్డింగ్‌లు నిర్మించుకునే వారు 33 కేవీ లైన్‌కు రెండు మీటర్లు, 11 కేవీ, ఎల్‌టీ లైన్లకు 1.2 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. లైన్ కింద బిల్డింగులు నిర్మించుకునే వారు 3.7 మీటర్ల క్లియరెన్స్ ఉండాలన్నారు. ఎవరికైనా సందేహాలు ఉంటే ఏటూరునాగారం ఏఈ అశోక్ 9440814867, కన్నాయిగూడెం ఏఈ స్వామి 7901678232. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో లైన్‌మెన్లను సంప్రదించాలని ఆయన కోరారు.

కావాలనే పీఏసీఎస్‌పై ఆరోపణలు

తాడ్వాయి, ఫిబ్రవరి 22 : కావాలనే కొందరు పీఏసీఎస్‌పై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని చైర్మన్ పులి సంపత్ అన్నారు. మండలకేంద్రంలోని కార్యాలయంలో శనివారం డైరెక్టర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పీఏసీఎస్ అభివృద్ధికి పాటుపడుతున్నానన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండాఎరువుల బస్తాలు అందిస్తున్నామని, కార్యాలయం అదనపు భవనం నిర్మించినట్లు చెప్పారు. ఇవన్నీ ఓర్వలేక కొందరు అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు చేస్తూ పీఏసీఎస్ పరువు తీస్తున్నారని మండిపడ్డారు. అసత్య ఆరోపణలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనుమానాలు ఉంటే కార్యాలయానికి వచ్చి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

ములుగురూరల్, ఫిబ్రవరి 22 : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని టీడబ్ల్యూజే(ఎఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యుడు పిట్టల మధుసూధన్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అన్ని జిల్లా కేంద్రాల్లో కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ములుగు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తున్నట్లు చెప్పారు. జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాజేడు, ఫిబ్రవరి 22 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన శనివారం మండలంలో జరిగింది. 108 ఈఎంటీ వినోద్‌కుమార్, పైలెట్ కుమారస్వామి కథనం ప్రకారం..ఆర్గుంటపల్లి- ప్రగళ్లపల్లి గ్రామాల మధ్యలో వెంకటాపురం నుంచి శ్రీరాంనగర్‌కు బైక్‌పై వెళ్తున్న అల్లి మల్లేశంను బొలెరో వాహనం ఢీకొట్టింది. స్థానికులు 108కు సమాచారం ఇచ్చి ఆటోలో తీసుకొస్తుండగా గంగారంకాలనీ వద్ద 108 వాహనంలో ఎక్కించుకొని వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మేరుగైన వైద్యకోసం భద్రాచలం ఏరియా వైద్యాశాలకు తరలించినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

SSC సర్టిఫికెట్లు పోయినవి

నేను, మాడిశెట్టి అఖిల D/o రవి, వృత్తి: విద్యార్థిని R/o భీమారం, మం॥ హన్మకొండ. తేది.11-02-2025న హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఖాజీపేట రైల్వేస్టేషన్‌లో దిగి భీమారం వెళ్లే సమయంలో నాయొక్క SSC MEMO, Study Certificates పోయినవి. ఎంత వెతికినానూ దొరకలేదు. కావున ఎవరికైన దొరికినచో సంప్రదించగలరు. సెల్ నెంబర్: 9121666096

WANTED

★Wanted Helper for Cloth Showroom in Hyderabad. Food and Staying Facility is available. Call: 9000321282, 9849409986.
NT-09041_All

HOUSE FOR SALE

★45 చ.గ.ల G+2 ఫర్నీషింగ్‌తో క్లియర్ టైటిల్ గలది. మెయిన్ రోడ్‌కు దగ్గరలో, రెనాల్డ్ స్కూల్ ఎదురుగా, ఎయిర్‌పోర్ట్ రోడ్, శంభునిపేట్, వరంగల్. సెల్: 9391565095/W: +18474431516.
NTW-6554

వృద్ధాశ్రమము

★హన్మకొండ వడ్డేపల్లి నందు ఆధునిక వసతులతో గత పది సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. సంప్ర: సెల్: 9949189357, 7287998022
NTW-332460

శ్రీలక్ష్మీగణపతి రియల్ ఎస్టేట్స్



★రామన్నపేటలో 70 గజాలు, 50 గ. G+1, 400 గజాలు, 72 గజాలు, 170 గజాలు G+2, 204 గజాలు G+2, 204 G+1, 66 G+2, 120 గజాలు చమన్ మావద్ద కలవు. సంప్ర: సెల్: 8096104080, 9292104080
NTW-326585

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

PLOT FOR SALE

★రాయగిరి కమాన్ దగ్గరలో వనమాలి టౌన్‌షిప్‌లో 133 Sq.yds., E/F ప్లాట్, 30 Ft. Road, LRS Rs. 1,000/- Paid, గజం: 6,000/-. Ph: 8897542838.
NT-1796

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565